క్లుప్తంగా

నేడు ఉచిత ఓపీ వైద్య సేవలు

కడప రూరల్ : స్థానిక జగదీష్ న్యూరో కేర్ జనరల్ మెడిసిన్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత ఓపీ వైద్య సేవలను నిర్వహిస్తున్నట్లు జనరల్ ఫిజీషియన్ డాక్టర్ క్రాంతిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఉచిత ఓపీ సేవలతోపాటు షుగర్ పరీక్ష ఉచితంగా నిర్వహిస్తామన్నారు. అవసరమైన వారికి డాక్టర్ సూచించిన అన్ని రక్త పరీక్షలపై 50 శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. బీపీ, షుగర్, థైరాయిడ్, అన్ని రకాల విష జ్వరాలు, టీబీ, ఉబ్బసం, కిడ్నీ, లివర్, అన్నిరకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించడంతోపాటు సలహాలు, సూచనలు అందిస్తారని తెలిపారు.

మహిళలు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సైకాలజిస్టు డాక్టర్ లలిత

కడప ఎడ్యుకేషన్: మానసిక సమస్యల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ లలిత పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ 4 ఆధ్వర్యంలో మూడవ రోజు వైవీయూలోని ఉమెన్స్ హాస్టల్‌లో మెంటల్ హెల్త్ అవేర్‌నెస్ పోగ్రాం జరిగింది. ఈ పోగ్రాంలో ఆమె మహిళలకు వచ్చే మానసిక సమస్యలు, జబ్బుల గురించి వివరిస్తూ మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకొని విజయవంతమైన జీవితాన్ని గడపాలన్నారు. అనంతరం అమ్మాయిలతో ప్రతిజ్ఞ చేయించి ర్యాలీని నిర్వహించారు. అలాగే యూనిట్ 7 ఆధ్వర్యంలో గర్ల్స్ సేఫ్టీ పోగ్రాంలో భాగంగా బాలికలు యుక్త వయస్సులో వచ్చే మార్పుల గురించి వివరించారు. అలాగే సైబర్ విషయాలు, సోషల్ మీడియా నుంచి భద్రత ఎలా పొందాలనే అంశాల గురించి తెలియజేశారు. యూనిట్ 4 పోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సునీతా, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఉద్యోగుల వేతన పెంపుపై హర్షం



రామును సన్మానిస్తున్న నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : మెడికల్ కళాశాలల్లో దినసరి ఉద్యోగులుగా పనిచేస్తున్న వారికి రూ.18 వేల వేతనాన్ని పెంచడంపై వివిధ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం నగరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడారు. ఉద్యోగుల పక్షాన నిలిచి వేతనం పెంపునకు కృషి చేసిన ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి డబ్ల్యు రామును ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. కలెక్టర్, రిమ్స్ డిప్యూటీ కలెక్టర్, జిల్లా కార్మికశాఖ అధికారి, మెడికల్ కళాశాల అధికారులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేతి వృత్తుల జాతీయ ఐక్య వేదిక పార్టీ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున, ఐఎఫ్‌టీయూ జిల్లా కన్వీనర్ ఎస్.నాగరాజు, గ్రేటర్ రాయలసీమ అధ్యక్షుడు ఆంజనేయులు, సీపీఐ నాయకులు మనోహర్‌రెడ్డి, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గుర్రప్ప, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఓబయ్య, లోక్‌సత్తా నాయకుడు దేవర శ్రీకృష్ణ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు కాన్షీరాం



కాన్షీరాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

కడప రూరల్ : బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరాం అందరికీ ఆదర్శప్రాయుడు అని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నగిలి గుర్రప్ప అన్నారు. శుక్రవారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఇన్‌చార్జి బాలచంద్ర అధ్యక్షతన కాన్షీరాం 19వ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గుర్రప్ప మాట్లాడుతూ కాన్షీరాం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు స్వాతంత్య్ర ఫలాలను అందించాలని బహుజన సమాజ్ పార్టీని స్థాపించారని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బేబి, అడ్వయిజర్ రెడ్డెయ్య, కార్యదర్శి రవి, రాయప్ప, సుబ్బయ్య, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేసే వరకు పోరాటం

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేసేవరకు పోరాటం చేస్తామని సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ తెలిపారు. ఈనెల 16న ప్రధాని నరేంద్ర మోదీ కర్నూలు జిల్లా పర్యటన సందర్భంగా కడపలో ప్రభుత్వ రంగంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని ప్రకటన చేసేలా కూటమి నేతలు ఒప్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన చట్టం హామీ ప్రకారం కడపలో సెయిల్ ఆధారిటీ ఆధ్వర్యంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని నేటికి ఏడేళ్లు కావస్తున్నా కేంద్ర ప్రభుత్వం ఇంతవరకు నోరు మెదపకపోవడం దారుణమన్నారు. కడప జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 16న నగరంలోని ఐటీఐ సర్కిల్ వద్ద నిరసన వ్యక్తం చేస్తామని తెలిపారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, కామనూరు శ్రీనివాసులరెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మానసికారోగ్యం.. మెరుగైన సమాజానికి సోపానం



మాట్లాడుతున్న జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్



ర్యాలీలో పాల్గొన్న అధికారులు

కడప అర్బన్: మానసిక ఆరోగ్య సంరక్షణ హక్కు మాత్రమే కాదని, బాధ్యతగా తీసుకున్నప్పుడే మెరుగైన సమాజం నిర్మితమవుతుందని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశానుసారంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ డాక్టర్ సి.యామిని సూచనల మేరకు సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో రిమ్స్ ఆవరణలో ఉన్న ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ వారి సహకారంతో శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ 1992, అక్టోబరు 10న డిప్యూటీ సెక్రటరీ జనరల్ రిచర్డ్ హంటర్ సహకారంతో తొలిసారిగా ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహించారని తెలిపారు. ప్రపంచ దేశాల ఆరోగ్య మంత్రిత్వ శాఖలు, పౌర సమాజ సంస్థలతో ఉన్న సంబంధాలను ఉపయోగించి మానసిక ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంచడం కోసం ప్రపంచ ఆరోగ్య సంస్థ ద్వారా ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవ నిర్వాహణకు సహకారం లభిస్తోందని పేర్కొన్నారు.

మానసిక ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదు

మానసిక అనారోగ్యం ప్రపంచవ్యాప్తంగా ప్రజల జీవితాలపై చూపించే ప్రభావాలను దృష్టికి తీసుకురావడానికి వేలాదిమంది స్వచ్ఛంద కార్యకర్తలు ఈ వార్షిక అవగాహన కార్యక్రమాన్ని జరుపుకుంటారన్నారు. మానసిక ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదన్నారు. స్వీయ సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఆరోగ్యకరమైన ఆహారాన్ని భుజించాలని, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు.

ర్యాలీ

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం కడప మున్సిపల్ కార్పొరేషన్ నుంచి మహావీర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జమున, రిమ్స్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్ రావు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. నాగరాజు, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్. వెంకట్రాముడు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



కడప వైఎస్ఆర్ సర్కిల్: ధర్నా చేస్తున్న పెన్షనర్లు



కడప ఎడ్యుకేషన్: మాట్లాడుతున్న చెన్నారెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్: బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని బీఎస్ఎన్ఎల్ జిల్లా పెన్షనర్స్ జిల్లా కార్యదర్శి కల్యా సుధాకర్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయంలో బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 పెన్షన్ రద్దు చేసి, 8వ పే కమిషన్ వేయాలని డిమాండ్ చేశారు. బీఎస్ఎన్ఎల్ పెన్షనర్లకు 2017 జనవరి నుంచి పెన్షన్ సవరణ ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, ఏఐబీడీపీఏ ఎంప్లాయిస్ జిల్లా కార్యదర్శి ఆకుల సుబ్బారావు, పోస్టల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జయరాం, బీఎస్ వెంకటసుబ్బయ్య, రాజు, సంగీతరావు, జిల్లా కోశాధికారి వెంకటసుబ్బయ్య, రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కడపలోని పెన్షనర్ల భవనంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చెన్నారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పెన్షనర్లకు న్యాయమైన సమస్యలతో పెండింగ్ బకాయిలను చెల్లించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి నాయుడు మాట్లాడుతూ అనేక సమస్యలు ఉన్నప్పటికీ ప్రధానమైన సమస్య ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌ను అమలు చేయాలని కోరారు. వర్కింగ్ ప్రెసిడెంట్ నాగమునిరెడ్డి మాట్లాడుతూ సభ్యులందరూ ఐక్యంగా సమస్యలపై ఉద్యమించాలని సూచించారు. వైస్ ప్రెసిడెంట్ తుపాకుల నారాయణ మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, జేఏసీగా ఏర్పడి పోరాడాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు అపూర్వ సుందరి, నూనె నగేష్, చెంచు రెడ్డి, సుభాన్, నాగయ్య, చలపతి గౌడ్, సత్యరాజు పాల్గొన్నారు.

ప్రజారోగ్యాన్ని విస్మరిస్తున్న ‘కూటమి’

వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్



కడప కార్పొరేషన్: ప్రజల ఆరోగ్యాన్ని కూటమి ప్రభుత్వం విస్మరిస్తోందని వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్ విమర్శించారు. శుక్రవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో 13 జిల్లాలను 26 జిల్లాలుగా పెంచి ఒకేసారి 17 మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చారని, కడపలో రిమ్స్‌లో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభించారన్నారు. ఒక్కో మెడికల్ కాలేజీకి 50 ఎకరాల స్థలం ఉండేలా ఒక్కో కాలేజీకి 500 కోట్లు ఖర్చు చేసి అన్ని రకాల సదుపాయాలతో క్యాంపస్‌లను అభివృద్ధి చేశారన్నారు. వైఎస్ జగన్‌కు ఆ ఘనత దక్కకూడదని చంద్రబాబు దుర్మార్గంగా వ్యవహరిస్తూ రాష్ట్ర ప్రజలకు, బడుగు బలహీన పేద విద్యార్థులకు తీరని అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు తీరు మార్చుకోకపోతే మూల్యం చెల్లించక తప్పదు అని హెచ్చరించారు. ప్రజల ప్రాణాలను హరించే మద్యం ఆదాయంపై ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ, పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల భవిష్యత్‌పై లేదని ఆందోళన వ్యక్తం చేశారు.


రేపు పెన్షనర్ల సమస్యలపై సదస్సు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: పెన్షన్ వ్యవస్థ సంస్కరణల పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దాడి అనే అంశంపై ఆదివారం సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్. రామకృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సదస్సుకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈపీఎఫ్ 95 పెన్షన్ దారుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఈపీఎఫ్ 95 పెన్షన్ దారులకు కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని కోరారు. ఈపీఎస్ 95 పెన్షన్ స్కీమ్ గురించి ప్రస్తుతం ఈ స్కీంలో దేశవ్యాప్తంగా 80 లక్షల పైబడి పెన్షనర్లు ఉన్నారని, అందులో 35 లక్షల మందికి రూ .1,000 లోపు మాత్రమే పెన్షన్ ఇస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీ కమిషన్ నియమించి మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెన్షనర్ల హక్కులపై ఈ సదస్సులో చర్చించి, భవిష్యత్తు కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ జిల్లా సదస్సుకు పెన్షనర్స్ అసోసియేషన్ అఖిలభారత కోఆర్డినేషన్ నాయకులు ఎం జనార్దన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సత్తిరాజు హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సోమశేఖర్ రెడ్డి, కే. బుడ్డయ్య, ఎన్సీఎస్ రెడ్డి, యూవీ రమణ, సెల్వ రాజు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఆర్టీసీ అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతీ విద్యార్థి కష్టపడి ఏకాగ్రతతో చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఏపీఎస్ఆర్టీసీ కడప జోన్ ఈడీ పైడి చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం ఏపీఎస్ ఆర్టీసీ కో ఆపరేటివ్ సొసైటీ తరుపున 2024–25 సంవత్సరంలో టెన్త్, ఇంటర్మీడియేట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగుల పిల్లలకు ఈడీ చేతుల మీదుగా అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన పిల్లల ఉద్యోగులను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీపీఎం గజలక్ష్మి, డిప్యూటీ సీటీఎం ప్రశాంతి, డిపో మేనేజర్ జనార్దన్, ఎంసీ మెంబర్ వినోద్, సీసీఎస్ డెలిగేట్ శ్రీను, కృష్ణ పాల్గొన్నారు.

డ్రైవర్ ప్రవర్తన వల్లనే ఘర్షణ



మాట్లాడుతున్న హేమవర్ధన్

కడప రూరల్ : ఇటీవల దువ్వూరు మండలం గుడిపాడు దగ్గర జరిగిన ఘర్షణ బస్సు డ్రైవర్ షేక్ మొహమ్మద్ ప్రవర్తన వల్లనే జరిగిందని హేమవర్ధన్ తెలిపారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడపకు రావడానికి దువ్వూరు బస్టాండ్ వద్ద తాము 7.50 గంటలకు ఆళ్లగడ్డ డిపోకు చెందిన బస్సు ఎక్కుతుండగా బస్సు కదిలిందని తెలిపాడు. దీంతో తాను గట్టిగా డోర్‌ను కొట్టానని, కండక్టర్ చెబుతూ ఉన్నా వినకుండా డ్రైవరు ఇష్టానుసారంగా తిట్టాడన్నారు. బస్సు గుడిపాడు రాగానే డ్రైవరు బస్సు ఆఫ్ చేసి తిడుతూ బస్సులో నుంచి కిందికి తోసి వేశాడన్నాడు. ఈ క్రమంలో తనకు చేయి కూడా విరిగిందని తెలిపాడు. ఇలాంటి డ్రైవర్ వల్ల ఆర్టీసీ పరువు పోతుందని, అతనిపై ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

పరిశుభ్రతతోనే మెరుగైన ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌ఓ నాగరాజు

కడప రూరల్ : వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోనే మెరుగైన ఆరోగ్యం సమకూరుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. శుక్రవారం స్థానిక అబ్దుల్ నబీ స్ట్రీట్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఇంటిలోని పాత్రలను, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల నిర్మూలనకు దోమతెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి మహేశ్వర్‌రెడ్డి, అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి, సబ్ యూనిట్ అధికారి నాగలక్ష్మిరెడ్డి, ఎంపీహెచ్‌ఈఓలు బాల పుల్లయ్య, వరదా రెడ్డి, ఏఎన్ఎం శోభన, సుజాత, లక్ష్మిదేవి పాల్గొన్నారు.

తారక రామానగర్‌లో కార్డన్ సెర్చ్



సోదాలు చేస్తున్న పోలీసులు

కడప అర్బన్: కడప నగరంలోని తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ రెడ్డెప్ప ఆధ్వర్యంలో ఎస్ఐ తులసి నాగప్రసాద్ సిబ్బందితో కలిసి శుక్రవారం ఉదయం తారక రామానగర్‌లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైనా అనుమానితులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వాహనదారులు లైసెన్సులు, రికార్డులను కలిగి ఉండాలన్నారు.

రౌడీ షీటర్ అరెస్ట్

కడప నగరంలోని తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 9వ తేదీన శాస్త్రి నగర్‌లో పర్వీన్ అనే మహిళ ఇంటిలోకి వెళ్లి సామగ్రిని ధ్వంసం చేసి, డబ్బుల కోసం బెదిరించిన రౌడీ షీటర్ అజీజ్‌ను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తులసి నాగప్రసాద్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కడప కార్పొరేషన్: కడప పట్టణంలో విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణలో భాగంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని కడప టౌన్2 సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి. లక్ష్మానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ముత్రాస్ పల్లి, రెడ్డి కాలనీ, పక్కీరుపల్లి, ఓం శాంతి నగర్, అబ్దుల్ కలాం కాలనీ, చిన్న చౌక్ విద్యా మందిర్ స్కూల్, భాగ్యనగర్ కాలనీ, దేవుని కడప, గౌస్ నగర్, నిర్మల స్కూల్, మాచుపల్లి రోడ్డు, మాసాపేట, నమస్తే బోర్డు, భారతి బార్, ద్వారకానగర్, సంధ్యా సర్కిల్, ఎర్రముక్కపల్లి, సీపీ బ్రౌన్, మున్సిపల్ ఆఫీసు, ఆర్టీసీ బస్టాండు, పటేల్ రోడ్డు, అరవింద్ నగర్, తేజ పెట్రోల్ బంకు, బాలాజీనగర్, అక్కయ్యపల్లి, నబికోట, బిల్టప్, విజయదుర్గాకాలనీ, వినాయక్ నగర్, నకాష్, అల్మాస్‌పేట 1టౌన్, నాగరాజుపేట తదితర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు.

‘మూల’ సాహిత్య కృషి ప్రశంసనీయం

కడప ఎడ్యుకేషన్: వైఎస్సార్ కడప జిల్లాలో ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి సాహిత్య, కళా రంగాలకు చేస్తున్న కృషి ప్రశంసనీయమని చాంద్ బీ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రసిద్ధ ఆడిటర్ లయన్ పి. ఖాసీం ఖాన్ కొనియాడారు. మల్లికార్జునరెడ్డిని శుక్రవారం ఖాసింఖాన్ తన కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. మల్లికార్జున రెడ్డి తన రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం తెచ్చారని ప్రశంసించారు. అనంతరం ప్రముఖ కవి, రచయిత డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారిని కూడా సత్కరించారు. విజయా హోటల్స్ అధినేత మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని మార్చే శక్తి మహిళలకు ఉంది



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సలీంబాషా

కడప ఎడ్యుకేషన్: సమాజాన్ని మార్చే శక్తి మహిళలకు ఉందని, మనిషి ఎదుగుదల, అభివృద్ధిలో వారు తీసుకున్న బాధ్యత, నేర్పించిన క్రమ శిక్షణే ఊతమవుతుందని శ్రీమతి కోటిరెడ్డి రామసుబ్బమ్మ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సలీం బాషా అన్నారు. కడప కోటిరెడ్డి రామసుబ్బమ్మ మహిళా కళాశాల ఆంగ్ల విభాగం, ఎల్ఐసీ శ్రామిక మహిళా విభాగం–సంయుక్తంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సవాళ్లను స్వీకరించే శక్తి, అవకాశాలను అందిపుచ్చుకునే నైపుణ్యం ఈ తరం చదువుకున్న అమ్మాయిలకు ఉందని పేర్కొన్నారు. పోటీ పరీక్షల్లో అబ్బాయిలను అధిగమించి అమ్మాయిలు విజయం సాధించడం రేపటి వెలుగులకు సంకేతమని వ్యాఖ్యానించారు.

మహిళలు ఎందులోనూ తక్కువ కాదు

ఎల్ఐసీ శ్రామిక మహిళా కో కన్వీనర్ శ్రీకృష్ణ, యూనియన్ నాయకులు అవధానం శ్రీనివాస్, రఘునాథరెడ్డి మాట్లాడుతూ తమ సంఘం ఏర్పడి 75 సంవత్సరాల సందర్భంగా త్వరలో ×దేశంలో చదువుకున్న మహిళలకు ఉన్న అవకాశాలు, సవాళ్ల అనే అంశంపై వక్తృత్వ పోటీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుల సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా అన్నిరంగాల్లో రాణించాలని చెప్పారు. అనేక మంది మహిళలు రాణిస్తూ దేశంలో ఉన్నతస్థాయికి చేరుకున్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారన్నారు. శుక్రవారం నిర్వహించిన వక్తృత్వ పోటీలో మొత్తం 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు.ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఎస్. బీబీ అయేషా బేగం, ఎస్ షఫీఉన్నిసా బేగం, యమున నిలిచారు. తస్లీమా, సయ్యద్ సానియాలు కన్సోలేషన్ బహుమతులు అందుకున్నారు. న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ కేవీ రమణ, పి.సుజాత వ్యవహరించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గురివి రెడ్డి విజేతలను అభినందించారు.క ార్యక్రమంలో మహిళా కళాశాల ఆంగ్ల విభాగం అధ్యాపకులు డాక్టర్ కేశవ రెడ్డి, ఆశాలత డాక్టర్ నాగమునిరెడ్డి, అజంతుల్లా, ఎల్ఐసి మహిళా విభాగం తరఫున సుజాతమ్మ,, శ్రీవాణి, లీలా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న కేంద్రం



పోస్టల్ ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఉద్యోగం నుంచి తొలగించిన తపాలా ఉద్యమ జాతీయ నాయకుడు మహాదేవయ్యను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని నగరంలోని పోస్టల్ ప్రధాన కార్యాలయం ఎదుట ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ రాష్ట్ర సహాయ కోశాధికారి వి. భానుకృష్ణ, జీవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామీణ తపాలా ఉద్యోగుల సంక్షేమం కోసం నియమించిన కమలేష్ చంద్ర కమిటీ ఇచ్చిన సానుకూల సిఫార్సులను అమలు చేయాలని పేర్కొన్నారు. కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 2023 డిసెంబర్ నెలలో నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చి నాలుగు రోజుల పాటు సమ్మెను నిర్వహించిన అనంతరం తపాలా శాఖ ఉన్నతాధికారులు హామీ ఇచ్చిన అనంతరం ఆ సమ్మెను నిలిపివేశామని తెలిపారు. ఆనాడు జరిగిన సమ్మెకు నాయకత్వం వహించినందున మహదేవయ్యకు చార్జిషీట్ ఇచ్చి కక్షపూరితంగా ఈనెల 8వ తేదీన ఉద్యోగం నుంచి తొలగించిన నేపథ్యంలో దేశవ్యాప్తంగా నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్, ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా అన్ని తపాలా కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలను చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పీఏ సలాం, పి. రాము, ఎస్. మహబూబ్‌బాషా, జె. సుబ్బారాయుడు, రమణయ్య, రవికాంత్, పాలకొండ్రాయుడు, మునాఫ్, రాంబాబు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన జీవనశైలితో వ్యాధులు దూరం



మాట్లాడుతున్న వెల్నెస్ కోచ్ జేసీ రెడ్డి

కడప ఎడ్యుకేషన్: చక్కటి జీవనశైలి, ఆరోగ్యకరమైన అలవాట్లతో వ్యాధులు దరి చేరవని హైదరాబాదుకు చెందిన వెల్నెస్ కోచ్ జేసీ రెడ్డి అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం సైన్స్ బ్లాక్‌లోని సెమినార్ హాల్లో ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ రెడ్డి మాట్లాడుతూ నల్ల అల్లం దుంపలు (కెన్ఫిరియా పర్విఫ్లోరా) సారంతో సహజ సిద్ధమైన క్యాప్సూల్స్ రూపంలో ఉన్న వీఆర్–4 మందు బీపీ, థైరాయిడ్, క్యాన్సర్, కాళ్ల నొప్పులు వంటి వ్యాధులకు చక్కగా పనిచేస్తుందన్నారు. పర్టీలిటి కోసం ఈ మందులు వాడవచ్చని తెలిపారు. మలేషియా కేంద్రంగా వోల్టాన్ ఇంటర్నేషనల్ సంస్థలో తయారైన ఈ మందు గురించి పరిశోధకులు 104 పరిశోధన పత్రాలను రాసి ధ్రువీకరించాలని తెలిపారు. విశ్వవిద్యాలయం జన్యుశాస్త్రశాఖ సహ ఆచార్యులు డాక్టర్ ఎల్. దాక్షాయణి, భూగర్భ శాస్త్ర శాఖ ఆచార్యులు ప్రొఫెసర్ వి. సునీత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐక్యు ఏసీ డైరెక్టర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం శర్మ, ప్రొఫెసర్ చంద్రమతి శంకర్, పీఆర్‌సీఎల్ డైరెక్టర్ డాక్టర్ పి.సరిత, ఆచార్య మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ టి. చంద్రశేఖర్, ప్రొఫెసర్ రియాజున్నీసా, విద్యార్థులు, అధ్యాపకులు,బోధనేతల సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల భద్రతకు శక్తి యాప్ కవచం



మాట్లాడుతున్న ఎస్ఐ శాంతమ్మ

కడప ఎడ్యుకేషన్: శక్తి యాప్ మహిళల భద్రతకు కవచం లాంటిదని శక్తి టీమ్ మహిళా ఎస్ఐ శాంతమ్మ పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరశివార్లలోని అంబేడ్కర్ గురుకుల వసతి గృహంలో శక్తి యాప్ వినియోగంపై బాలికలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా శక్తి టీమ్ మహిళా ఎస్.ఐ శాంతమ్మ మాట్లాడుతూ శక్తి యాప్ మహిళలు, బాలికల రక్షణతోపాటు ఆపద సమయంలో ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఏదైనా అపాయం, అనుకోని ఘటన జరిగి ప్రమాదంలో ఉన్నప్పుడు శక్తి యాప్ ద్వారా తక్షణ సాయం పొందవచ్చన్నారు. ఎస్ఓఎస్ బటన్ డయల్ 112 నంబర్‌కు కాల్ చేసిన 10 నిమిషాల్లో మీ చెందకు పోలీసులు చేరుకుని సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపతారన్నారు. అలాగే మహిళలు చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ మోసాలపై డయల్ 100,112, చైల్డ్ లైన్ 1098, గృహ హింస 181, మహిళ వేధింపులు 1091,సైబర్ టోల్ ఫ్రి 1930, సైబర్ మిత్ర, సంబంధిత పోలీసు అత్యవసర సేవల గురించి కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవీలత, ఉపాధ్యాయులు, గురుకుల పాఠశాల విద్యార్థులు, శక్తి టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు దూరం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ.. ప్రమాదాలను అరికట్టాలని కడప ట్రాఫిక్ సీఐ జావీద్ సూచించారు. శుక్రవారం కడప నగరంలోని ఆర్ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో ప్రమాదాలకు, ర్యాష్ డ్రైవింగ్, ఫిర్యాదులు వచ్చిన డ్రైవర్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత డ్రైవర్లపై ఉంటుందన్నారు. ఆర్టీసీకి ప్రమాద రహిత సంస్థగా గుర్తింపుఉందని, అందుకు అనుగుణంగా సేవలు అందించాలని కోరారు. బ్లాక్‌స్పాట్‌ల గురించి అవగాహన కల్పించారు. తొలుత బ్రహ్మకుమారీ సంస్థ ప్రతినిధి ప్రదీప డ్రైవర్లతో మానసిక ప్రశాంతత కోసం ధ్యానం చేయించారు. బద్వేలు డిపో మేనేజర్ నిరంజన్ ఇంధన పొదుపుపై అవగాహన కల్పించారు. అధికారులు, వివిధ డిపోలకు చెందిన 25 మంది డ్రైవర్లు, మహిళా కండక్టర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి తదితరులు

కడప ఎడ్యుకేషన్: విశ్వశాంతి సేవాసదన్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్వచ్ఛతా హాయ్ సేవా -2025 ఉత్సవ్ కార్యక్రమాలల్లో భాగంగా జిల్లాలో వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు చిత్రకళలు, డ్రాయింగ్, క్రాఫ్ట్, పెయింటింగ్ పోటీలను నిర్వహిస్తారని విశ్వశాంతి సేవాసదన్ సంస్థ జిల్లా అధ్యక్షుడు వెంకటేశు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామ చంద్రారెడ్డి, విశ్వశాంతి సేవాసదన్ సంస్థ అధ్యక్షులు వెంకటేశు, ఆపూస్మ వర్కింగ్ ప్రెసిడెంట్ పోలు వెంకటసుబ్బయ్య, జిల్లాస్థాయి ఉత్సవాల కమిటీ సభ్యులు చంద్రశేఖర్, రాము, చంద్ర, భాస్కర్,తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఈ పోటీలను అక్టోబర్, నవంబర్ నెలల్లో నిర్వహిస్తారని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గెలుపొందిన విద్యార్థులను బహుమతులు ప్రదానం చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.